
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జనగామ
బుధవారం 13 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	బుధవారం	సా : 6.31 గం..
సహర్ :	గురువారం	ఉ : 5.03 గం..

కమలం గూటికి అరూరి



- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ
- నేడు ఢిల్లీలో చేరికకు ఏర్పాట్లు
- అనుచరులతో సమావేశం తర్వాత రాజధానికి పయనం
- రమేష్ రాకతో బలం పెరుగుతుందని భావిస్తున్న బీజేపీ
- కడియం శ్రీహరితో టచ్‌లోకి కాంగ్రెస్?
- మారుతున్న ఓరుగల్లు రాజకీయం
- లోక్‌సభ ఎన్నికల వేళ 'గులాబీ'దళంలో అయోమయం

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ కమలం గూటికి చేరడం ఖాయమైంది. ఈ క్రమంలోనే సీనియర్‌నేత, మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు వార్తలు రావడం.. ఇప్పటి కే వరుస వలసలతో కుదేలవుతున్న బీఆర్ఎస్‌ను మరింత కలవరపెడుతోంది. ఆరూరి చేరికతో బలపడొచ్చన్న భావనలో బీజేపీ ఉండగా.. బీఆర్ఎస్‌కు ఎలాగైనా చెక్‌పెట్టాలన్న యోచనతో కాంగ్రెస్ పావులు కదుపుతుండటంతో ఓరుగల్లు రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. చివరగా ఏ పార్టీ నుంచి ఎవరు పోటీచేస్తారన్న దానిపై అందరిలోనూ ఉత్కంఠ కనిపిస్తోంది.

నేడు బీజేపీలోకి అరూరి

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు పలువురు పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ టికెట్‌పై బీజేపీ పెద్దల నుంచి హామీ పొందిన అరూరి రమేష్ బుధవారం వరంగల్‌లో అనుచరులతో సమావేశం నిర్వహించి, బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించి ఆ తర్వాత సాయంత్రానికి ఢిల్లీ వెళ్లి కాషాయ కండువా కప్పుకోబోతున్నారు. అయతే పది రోజుల కిందటే బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్న రమేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హైదరాబాద్ పిలిచి బుజ్జగించడంతో మెత్తబడిన రమేష్ తాను పార్టీ మారేది లేదని చెబుతూ వచ్చారు. కానీ అనూహ్యంగా ఆయన మంగళవారం బీజేపీ నేత అమిత్‌షాను కలవడం చర్చనీయాంశమైంది. ఇక రమేష్‌ను బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించిన అమిత్‌షా వరంగల్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని, పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు పార్టీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం ఉంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆరూరి తన 'కారు' ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టడం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుండగా.. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ రాకతో తమ బలం పెరుగుతుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

కడియం శ్రీహరికి కాంగ్రెస్‌కు ఆఫర్..

మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తీసుకవచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. వరంగల్ లోక్‌సభ నుంచి ఎంపీగా కడియం శ్రీహరిని బరిలో దించాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2014లో వరంగల్ ఎంపీగా గెలిచిన కడియం శ్రీహరికి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కడియంను కాంగ్రెస్ నుంచి బరిలో దించేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ నేత ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ ఎంపీగా కడియం పోటీ చేస్తే, ఫలితాల అనంతరం ఆయనతో స్టేషన్‌ఘనపూర్‌కు రాజీనామా చేయించి.. ఆ తర్వాత జరిగే ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె కడియం కావ్యకు టికెట్ ఇస్తామని కూడా కాంగ్రెస్ నుంచి ఆఫర్లు వస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కడియం శ్రీహరితో నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్టు సమాచారం. కాంగ్రెస్ రెండో జాబితా బుధవారం రాత్రి లేదంటే గురువారం వెలువడే అవకాశం ఉంది. కడియం నుంచి అనుకూల స్పందన వస్తే మూడో జాబితా వరకు వరంగల్ సీటుపై పెండింగ్ పెట్టాలని కూడా కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే నిత్యం కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్న కడియం శ్రీహరి పార్టీ మారుతారా? అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

హస్తం వైపు మేయర్ చూపు

ఇప్పటికే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే వీరితో పాటే హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నించి మేయర్ గుండు సుధారాణి రాకను జిల్లాకు చెందిన ఓ మంత్రితో పాటు పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అడ్డుకున్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేయర్ చేరికపై అభ్యంతరం చెప్పుతున్న నేతలతో మాట్లాడి ఒప్పించినట్లుగా తెలిసింది. దీంతో త్వరలోనే మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్‌లోని కీలక నేతలు పార్టీ మారుతుండటంపై ఓరుగల్లులో హాట్‌హాట్‌గా రాజకీయాలు మారుతున్నాయి.

పెళ్లింట విషాదం

- 16న వివాహం.. అంతలోనే వరుడి మృతి
- కెనాల్‌లో మృతదేహం లభ్యం.. ఆత్మహత్యగా అనుమానాలు



కృష్ణతేజ(ఫైల్)

వరంగల్ క్రైం, మార్చి 12: పెళ్లిబాజా మోగాల్సి ఆ ఇంట విషాదం నెలకొంది. ఈనెల 16న పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు కెనాల్‌లో శవమై కనిపించాడు. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన భూక్యా కృష్ణతేజ(29) ఆదివారం సాయంత్రం తన పెళ్లికార్డులు స్నేహితులకు ఇచ్చేందుకు బైకుపై వెళ్లి.. రాత్రయినా రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువేల్పుల సమీపంలోని కెనాల్ వద్ద కృష్ణతేజ బైక్ ఉన్నట్లు తెలిసింది. వెళ్లిచూసిన కుటుంబ సభ్యులు ఆ బైకు కృష్ణతేజదని గుర్తించి యువకుడి తల్లి శకుంతల కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ నిర్వహిస్తుండగా.. మంగళవారం కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేట సమీపంలోని కెనాల్‌లో లభించింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు యువకుడి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివాహం ఇష్టంలేక కృష్ణతేజ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కృష్ణతేజ మృతదేహం వర్ధన్నపేటలో తేలిందని కేయూ ఎస్ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, మార్చి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. రాష్ట్రం లో నూతనంగా ఏర్పడిన రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. మంగళవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలన్నారు. సీతారాములు, జడ్పీటీసీ శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరమ్మతులు చేసి సాగునీరు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్ జలసౌధలో నీటిపారుదల అధికారులతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 12: దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని పలు కాలువలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తి చేసి రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటిపారుదలశాఖ అధికారులను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) నాగేందర్ కార్యాలయంలో దేవాదుల ప్రాజెక్టు పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ ఆర్ఎస్ ఘన్‌పూర్ కెనాల్ ద్వారా సుమారు 49వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని తానేధార్‌పల్లి, బోయినిగూడెం, కోమటీగూడెం, కంచనపల్లి, శ్రీమన్నారాయణపురం నవాబుపేట గ్రామాల పరిధిలోని కాలువలను ఇటీవల సందర్శించి దిగువ గ్రామాలకు సాగునీరు అందించే విధంగా సూచనలు చేయడం జరిగిందన్నారు. బోయినిగూడెం తూముకు షటర్లు లేకపోవడంతో నీరు వృథా అవుతుందని, షటర్లు అమర్చాలని సూచించడం జరిగిందన్నారు. శ్రీమన్నారాయణపురం- బాంజీపేట మధ్య గల కెనాల్‌లో ఇసుకమేటలను తొలగించాలని సూచించారు. 16ఎల్, 18ఎల్ భూ నిర్వాసితులతో మాట్లాడి వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. నవాబుపేట రిజర్వాయర్ సమీపంలోని కుందారం ఫీడర్‌ఛానల్ వద్ద ఓటీ (అండర్ టన్నెల్)ని ఏర్పాటు చేయాలని సూచించారు.

గండిరామారం ఎడమ కాలువకు ఎక్కువ మోతాదులో సాగునీరును విడుదల చేయాలని, ఆర్ఎస్ ఘన్‌పూర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్ల నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తే లక్ష ఎకరాలకు మేర సాగునీరు అందించవచ్చు అని సూచించారు. సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ నాగేందర్, సీఈ రమేష్‌బాబు, వరంగల్ ఎస్ఈ సుధీర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన

పెద్ద ఎత్తున హాజరైన భక్తులు

వివరాలు 8వ పేజీలో

ఇదేం తీరు?

ప్రైవేటు ఫంక్షన్ హాల్ రోడ్డుకు ప్రభుత్వ నిధులు

రూ. 40 లక్షల ఈజీఎస్ నిధులతో రోడ్డు నిర్మాణం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



జనగామ-సూర్యాపేట జాతీయ రహదారి నుంచి ఫంక్షన్ హాల్‌కు వేసిన సీసీరోడ్డు

లింగాలఘణపురం, మార్చి 12: వందలాది కుటుంబాలు నివాసముండే పల్లెకు రోడ్డు మంజూరు కావాలంటే శతకోటి సాకులు చూపించే అధికార యంత్రాంగం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌కు సీసీరోడ్డు నిర్మాణం చేసేందుకు మాత్రం నిబంధనలు తుంగలో తొక్కింది. కేవలం ఫంక్షన్ హాల్ నిర్వాహకుల మెప్పుకోసం ఏకంగా రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేసిన అధికారులు సదరు యజమానులతో శభాష్ అనిపించుకుంటున్నా.. జిల్లా ప్రజల చేత మాత్రం చీవాట్లు తింటున్న వైనం లింగాల ఘణపురం మండలం నెల్లుట్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న భ్రమరాంబ ఫంక్షన్ హాల్ జనగామ-సూర్యాపేట జాతీయ రహదారికి 600 మీటర్ల దూరంలో ఉంటుంది. దీనికోసం రోడ్డు నిర్మాణం చేసేందుకు ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు గతేడాది అప్పటి మంత్రితో పాటుగా అప్పటి కలెక్టర్‌ను కలిసిరోడ్డు నిర్మాణం కోసం విన్నవించుకున్నారు. కాగా అప్పటి అధికార యంత్రాంగానికి మనసు మంచుగడ్డలా కరిగిపోయి ఏకంగా రూ. 40 లక్షలు ఈజీఎస్ నిధులను ఆగమేఘాల మీద మంజూరు చేసింది. వెంటనే ఇదే మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ రంగంలోకి దిగి గతేడాది నవంబర్‌లో చకచకా రోడ్డుపనులను మూడు రోజుల్లో పూర్తి చేశాడు. అయితే ఫంక్షన్ హాల్‌కు రోడ్డు నిర్మాణం వాళ్ల సొంత నిధుల ద్వారా వేసుకుంటున్నారని అంతా భావించారు. కానీ తాజాగా గ్రామస్థుల ఫిర్యాదుతో ఫంక్షన్ హాల్ కోసం వేసిన రోడ్డుకు ఈజీఎస్ నిధులను వినియోగించారని తెలిసి ఇప్పుడు అధికారుల తీరుపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు నిధులను ఫంక్షన్ హాల్ నిర్వాహకుల నుంచి రికవరీ చేసి ప్రభుత్వ ఖాతాకు జమచేయాలని జిల్లా ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై డీపీవో రంగాచారిని వివరణ కోరగా ఈజీఎస్ నిధుల మంజూరు ప్రక్రియ తమ పరిధికి రాదని రోడ్డు నిర్మాణం చేసిన విషయం గానీ గ్రామపంచాయతీ నుంచి వీడీసీ ఇచ్చి విషయం కూడా తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

వడ్డీపై రాయితీ..

మునిసిపల్ పరిధిలో బకాయిల వసూళ్లపై ప్రభుత్వం దృష్టి

ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించిన వారికి 90 శాతం వర్తింపు

2022-23 బకాయిల్లో రూ.43.41 లక్షలే వసూలైన వైనం

ఆఫర్ ఇచ్చినా ఆసక్తి చూపని ప్రజలు



జనగామ మునిసిపల్ కార్యాలయం



జనగామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో పేరుకుపోయిన పన్నుల వసూళ్లపై మునిసిపల్‌శాఖ దృష్టి సారించింది. పన్నులను వందశాతం వసూలు చేసేలా కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. గతంలో ముందస్తు చెల్లింపులపై 5 శాతం రాయితీ ఇచ్చేది. ప్రస్తుతం ఆ ఆఫర్ అమలో ఉన్నప్పటికీ మరోవైపు బకాయిలను కూడా కట్టించేలా ప్రభుత్వం ఆలోచన చేసింది. ఇందులో భాగంగా 2023 మార్చి లోగా బకాయిలు ఉన్న ఆస్తిపన్ను పన్ను విధించిన వడ్డీలో 90 శాతాన్ని మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో కరోనా సమయంలో ఆస్తిపన్నుపై ప్రభుత్వం రాయితీ ఇచ్చింది. ఆ తర్వాత నుంచి పన్ను చెల్లింపుదారుల్లో కొంత నిరాసక్తత ఏర్పడింది. ప్రభుత్వం మళ్లీ పన్నుపై రాయితీ ఇస్తుందనే ఆశతో ఆస్తిపన్నును సకాలంలో చెల్లించడం లేదు. దీంతో మునిసిపల్ నిర్వహణపై కొంత భారం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల్లోనూ ఇదే తరహా పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. మార్చి 1 నుంచి ఈ రాయితీ కార్యక్రమం అమల్లోకి వచ్చింది. జనగామ మునిసిపల్ పరిధిలో మార్చి 1 నుంచి ఆస్తిపన్ను వసూళ్లను సిబ్బంది వేగవంతంగా చేపడుతున్నారు. బకాయి ఉన్న ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తుండడంతో కొంత మేర ప్రజల నుంచి స్పందన బాగానే కనిపిస్తున్నా అధికారులు ఆశించిన మేర ప్రజలు ముందుకు రావడం లేదు.

మొత్తంగా రూ. 5.23 కోట్ల బకాయిలు

జనగామ మునిసిపాలిటీ పరిధిలో ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు 14,700 ఉన్నాయి. వీటికి సంబంధించి మొత్తంగా రూ. 5.23 కోట్ల ఆస్తిపన్ను బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఇందులో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.14 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.3.07 కోట్లు బకాయి ఉంది. ప్రభుత్వం 2022-23 ఏడాదికి సంబంధించిన బకాయి ఉన్న ఆస్తిపన్ను వడ్డీలో 90 శాతం రాయితీని ప్రకటించింది. కాగా.. 2022-23 ఏడాదికి సంబంధించి రూ.1.14 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉండగా దీనిపై వడ్డీ రూ.84.82 లక్షలు ఉంది. పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను పూర్తిగా చెల్లిస్తే రూ.84.82 లక్షల మేర లబ్ధి జరగనుంది.

బకాయి చెల్లింపుల్లో వెనుకడుగు

90 శాతం వడ్డీ మాఫీ ప్రకటించినప్పటికీ అధికారులు ఆశించినంతగా ప్రజలు ముందుకు రావడం లేదు. 2022-23 ఏడాదికి సంబంధించి ఆస్తిపన్ను రూ.1.14 కోట్లు, దానిపై వడ్డీ రూ.84.82 లక్షలు మొత్తంగా రూ.1.98 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా.. రాయితీ ప్రకటించిన ఈ 10 రోజుల్లో కేవలం రూ.43.41 లక్షలు మాత్రమే 2022-23 ఏడాది బకాయిలు వసూలు అయ్యాయి. బకాయిలు చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఉండగా ఆ లోగా వంద శాతం బకాయలు వసూలు అవుతాయనే ధీమాలో అధికారులు ఉన్నారు. కాగా.. ప్రస్తుత ఏడాది(2023-24)కి సంబంధించి ఆస్తిపన్ను చెల్లింపులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఆస్తిపన్ను, వడ్డీ కలిపి రూ. 3.24 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 2.29 కోట్లు వసూలు అయ్యాయి. ఈ మార్చి 31 లోగా రూ. 95.02 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ప్రభుత్వం వడ్డీపై రాయితీ ఇచ్చినా ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు.

ముందుగా చెల్లించిన వారికీ వర్తింపు

ప్రభుత్వం ప్రకటించిన వడ్డీపై రాయితీని ముందస్తుగా చెల్లింపులు చేసిన వారికి కూడా వర్తింప చేస్తామని ప్రభుత్వం తెలిపింది. వడ్డీపై 90 శాతం రాయితీకి సంబంధించి ఫిబ్రవరి 27న ప్రభుత్వం జీవో తీసుకురాగా మార్చి 2 నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో ఈ నాలుగు రోజుల్లోనూ కొంత మంది చెల్లింపులు చేశారు. దీంతో తాము పూర్తిగా చెల్లించినా వడ్డీ రాయితీ రాదేమోనని ఆందోళన చెందుతున్నారు. కాగా.. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. జీవో వచ్చిన రోజు నుంచి చెల్లించిన ప్రతీ ఒక్కరికీ ఈ వడ్డీపై రాయితీ వర్తిస్తుందని భరోసా ఇస్తున్నారు. కాగా.. ముందస్తుగా చెల్లించిన వారికి వారికి రావాల్సిన వడ్డీపై 90 శాతం రాయితీని వచ్చే ఏడాది ఆస్తిపన్నులో సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం జీవోలోనే పేర్కొంది.

అవగాహన కల్పిస్తున్నాం : పి. వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్, జనగామ

2022-23 ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. వడ్డీ రాయితీకి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మైకుల ద్వారా, పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలిపే ప్రయత్నం చేస్తున్నాం. మార్చి 31 వరకు గడువు ఉన్నందున ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

రైతులు క్షమించాలి

గుంట వరి పంట ఎండకుండా చూస్తా..

నీటి విడుదల్లో జాప్యంపై పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, మార్చి 12 : దేవాదుల ద్వారా సాగునీటి విడుదలలో కొంత జాప్యం జరిగిందని దీంతో వరి పంటలు ఎండిపోతున్నాయని బాధ్యతగా భావించి రైతులకు క్షమాపణ చెబుతున్నానని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మిషన్ భగీరథ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లో వరిసాగుకు నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండుతున్న విషయాన్ని పది రోజుల నుంచి దేవాదుల అధికారులతో మాట్లాడానని అన్నారు. అదే విధంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నీటి విడుదల కోసం విజ్ఞప్తి చేశానని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఈసందర్భంగా స్పందించి దేవాదుల అధికారులతో మాట్లాడారని రెండు రోజుల్లో పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు సాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు గత కాంగ్రెస్ హయంలోనే మంజూరి చేసి పనులు చేపట్టారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడి నుంచి మూడు సార్లు గెలిచిన మాజీ మంత్రి దయాకర్‌రావు పట్టించుకోలేదని విమర్శించారు. ఎండిపోయిన పొలాలల్లోకి వెళ్లిన మాజీ మంత్రి దయాకర్‌రావు ఫోటోలకు ఫోజులిచ్చి రైతుల పక్షాణ ఉన్నట్లు ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే ఫోర్ ఎల్ వద్ద షట్టర్ నిర్మాణం చేపట్టకపోవడం అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్లనేనని అన్నారు. గుంట వరిపొలం ఎండిపోకుండా చూస్తానని అన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాకిరాల హరిప్రసాద్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, నెహ్రూనాయక్, పెదగాని సోమన్న, శ్రీరాం, నాగయ్య, రమేష్, వెంకన్న, సంపత్, జల్లం కుమార్ తదిరులు ఉన్నారు.

ఎండిన పంటకు నష్టపరిహారం చెల్లించాలి

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ ధర్నా



పాలకుర్తిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి, మార్చి 12 : పాలకుర్తి మండల పరిధిలోని సాగునీరు లేకుండా ఎండిపోతున్న వరి పంటకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, మాచెర్ల ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వరి పంట ఎండిన రైతులందరికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు వచ్చిన కాలం కాదని, అంతా కరువుతో అల్లాడుతుంటుందని అన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు రాంబాబు, పాము శ్రీనివాస్, పసులాది శంకర్, లొంక మల్లేష్, కర్ణాకర్, బెల్లి సోమయ్య, అశోక్‌రెడ్డి, యాకయ్య తదితరులు ఉన్నారు.

కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారు..

-డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



గంగాపూర్ సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట, మార్చి 12: తెలంగాణాలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఆలీంపూర్, గంగాపూర్, తమ్మడపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారని, అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టారని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటి వరకు చెక్కు చెదరలేదని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిర్మించిన కాళేశ్వర ప్రాజెక్టులు పగుళ్లు పట్టాయన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఐదు ఇప్పటికే అమలుకు నోచుకుంటున్నాయని, మరో పథకం ప్రారంభించేందుకు సీఎం సిద్ధమవుతున్నారని తెలిపారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న దమ్మున ప్రభుత్వం తమదన్నారు. ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం లేకుండా అభివృద్ధి, సంక్షేమం వైపు ప్రభుత్వం వెళుతుంటే, పసలేని ఆరోపణలు చేస్తూ పరువు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాల న్నారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎండీ మసూద్, నిడిగొండ శ్రీనివాస్, కోడూరు మహాత్మాచారి, జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, గాలి కృష్ణ, జంగిటి విద్యానాథ్, మేకల రాజు, పుట్ట నర్సింహులు, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 97.72% విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 12: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం జనరల్ సెకండీయర్ విద్యార్థులకు ఫిజిక్స్ ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. 4333 మంది విద్యార్థులకు గాను 99 మంది గైర్హాజరు కాగా 4234 మందితో 97.72% విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. కాగా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, మార్చి 12: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాటర్ స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జనగామ డీటీడీఓ ప్రేమకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడ లో గల స్పోర్ట్స్ స్కూల్ లో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 89195 50711 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఈఈలు (సివిల్) బదిలీ

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయానికే పరిమితమైన సివిల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లకు ఎట్టకేలకు విముక్తి లభించింది. వారు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కార్పొరేట్ ఆఫీసులోని ఐదుగురు సివిల్ ఈఈలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం పరిధిలో పనిచేస్తున్న ఈఈ (సివిల్) వెంకటేశ్వర్‌ను హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఎస్ఈ ఆపరేషన్‌కు మార్చారు. ఈయన హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ సర్కిళ్ల పరిధిలోని సివిల్ పనులను పర్యవేక్షిస్తారు.

ఇదే కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-1) పరిధిలో పనిచేస్తున్న మరో ఈఈ (సీవిల్) కె.శ్రీనివాస్‌ను కరీంనగర్ హెడ్‌క్వార్టర్ ఎస్ఈ ఆపరేషన్ ఆఫీసుకు స్థాన చలనం చేశారు. ఈయన కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి ఆపరేషన్ సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ సివిల్ పనులను చూస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-11) కింద పని చేస్తున్న ఈఈ (సివిల్) జి వెంకటేశ్వర్లును ఖమ్మం హెడ్‌క్వార్టర్‌లోని ఎస్‌సీ (ఆపరేషన్) కార్యాలయానికి డైవర్ట్ చేశారు. ఈయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఆపరేషన్ సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీఈ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ (సివిల్) కోమిరెడ్డి స్వామిని నిజామాబాద్ ఎస్ఈ (ఆపరేషన్) ఆఫీసుకు మార్చారు. ఆయన నిజామాబాద్ కామారెడ్డి సర్కిళ్లను, అలాగే కార్పొరేట్ ఆఫీసులో ఎస్ఈ/క్యూసీ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈఈ (సివిల్) పి.జానార్దన్‌రావును ఆదిలాబాద్ జిల్లా ఎస్ఈ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పర్యవేక్షించాల్సిన వీరిని గత సీఎండీ గోపాల్‌రావు ఏడేళ్ల కిందట కార్పొరేట్ ఆఫీసుకు తీసుకువచ్చారు. దీనితో వీరికి పనిలేకుండా పోయింది. కొత్త సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారు. కార్పొరేట్ ఆఫీసులోని ఈఈ (సివిల్)లను ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల సర్కిళ్లకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలేదాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలావుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు

జనగామ టౌన్, మార్చి 12: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం, విజయ సంకల్ప సభకు జనగామ నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. జనగామ నియోజకవర్గం నుంచి 500 మంది తరలివెళ్లగా.. మొత్తం జిల్లా నుంచి 1500 మంది తరలివెళ్లినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి తెలిపారు. వాహన శ్రేణిని జనగామలో మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ నాయకులు సౌడ రమేశ్, ఉడుగుల రమేశ్, కొంతం శ్రీనివాస్, పిట్టల సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నర్మెట : నర్మెట మండలకేంద్రం నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు హైదరాబాద్ విజయ సంకల్ప సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ధరావత్ వినోద్, కొన్నెరాజు, బైరగోని ఆంజనేయులు, ధరావత్ నరేశ్, మెతుకు సిద్ధులు, శంక రయ్య, గోపాలచారి, ఆంజనేయులు, దేవేందర్ పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనానికి మండలం నుంచి బీజేపీ శ్రేణులు మంగళవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. విజయ సంకల్ప సమ్మేళనంకు కేంద్ర మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరవుతండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. బీజేపీ మండల అధ్య క్షుడు పుప్పాల వేణుకుమార్, జిల్లా కార్యదర్శి వల్లాల ఉపేందర్, మంద వెంకటేష్ యాదవ్, కావటి ముత్యాలు, కోడెల యాదగిరి తదితరులు ఉన్నారు.



జనగామ నుంచి వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న దశమంతరెడ్డి

● చిలుపూర్ : హైదరాబాద్‌లో నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి బూత్ కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ నేతృత్వంలో మల్కాపూర్, చిన్నపెండ్యాల, నష్కల్, మల్కాపూర్, పల్లగుట్ట తదితర గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు తోకల సంపత్‌రెడ్డి, తోట శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు వెలిశాల శ్రీనివాస్, కందుకూరి రజనీకర్, తోట రంజిత్, సాదం బీమన్న, దోరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్ : మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్న బీజేపీ విజయ్ సంకల్ప్ సభకు జఫర్‌గఢ్ మండలం నుంచి పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ఎదులాపురం మదన్‌మోహన్, ఎండి.వలీపాషా, గాదెపాక శ్రీను, మేరుగు రామరాజు, యాకస్వామి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రడపాక యాకలక్ష్మీ, పల్లె సంతోష్‌రెడ్డి, తాళ్లపల్లి సురేశ్ గౌడ్, పి.రాజు కార్యకర్తలు తదితరులు బస్సులో తరలివెళ్లారు

● స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రధాని మూడోసారి ముచ్చటగా ప్రధానమంత్రి కాబోతున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి తెలిపారు. పార్టీ మంగళవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కేంద్ర మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరైన విజయ సంకల్ప సభకు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల పదాధికారులు, తరలి వెళ్లగా సభకు వెళ్లే బస్సులను అంజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పార్టీ జిల్లా నాయకుడు భూర్ల విష్ణు, మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ, గంటె ఉపేందర్‌యాదవ్, నాగేష్‌గౌడ్, నాయకులు తాళ్లపల్లి కిశోర్‌గౌడ్, బల్ల రాజు, సాంబ రాజు, రడపాక ప్రదీప్, భూర్ల చిరంజీవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంట కోల్పోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

బచ్చన్నపేట, మార్చి 12: పంటలు ఎండిపోతున్నా పాలకులకు పట్టింపు లేకుండా పోయిందని జిల్లా రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయటమే ధ్యేయంగా పెటుకోవటం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క గుంట ఎండి పోకుండా నీళ్ల ఇచ్చామన్నారు. గోదావరిలో జలాలున్నప్పటికి పంపింగ్ చేసేందుకు ఆశక్తి చూపటం లేదన్నారు. దీంతో మరో నెల రోజుల్లో చేతికి అందవచ్చే దశలో ఉన్న పంట చేలు ఎండుతున్నాయన్నారు. పేరుకు రైతు ప్రభుత్వమంటూ, వారిని ఆదుకున్నదెక్కడో చూపాలన్నారు. రైతుబంధు లేదు.. రుణమాఫీ కాలేదు.. గోదావరి జలాలు ఇచ్చింది లేదని.. అలాంటప్పుడు రైతు ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏమొహం పెట్టుకుని ఓట్లడుగుతారని ప్రశ్నించారు. మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యేను పంచకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో అందించకుంటే తహసీల్దార్ కార్యాలయంను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మెన్ పూర్ణచందర్, వడ్డేపల్లి మల్లారెడ్డి, ఎంపీటీసీ కర్నాల వేణు, నాయకులు పందిపెల్లి సిద్దిరాంరెడ్డి, వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, ఎండీ షబ్బీర్, నీల రమేశ్, జంగిటి సిద్దులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : మాజీ మంత్రి

పాలకుర్తి, మార్చి 12 : వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులకు క్షమాపణ చెప్పడం కాదని, రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై దయాకర్‌రావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే నా ప్రాణం. తన ఊపిరి పాలకుర్తి నుంచి విడిచిపెట్టేది లేదని ఇక్కడే ఉండి మళ్లీ పోటీ చేస్తానని భరోసా కల్పించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో నీళ్లు పారుతున్నాయని, కానీ పాలకుర్తి నియోజకవర్గానికి ఎందుకు నీళ్లు వస్తలేవని ప్రశ్నించారు. రాజకీయం చేస్తాలేం, రైతుల పంటలు ఎండిపోతున్నాయి కాబట్టి రైతులను ఓదార్చేందుకు పంట పొలాలు పరిశీలించానని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో వడగళ్ల వర్షం కురిస్తే ఎకరానికి రూ. 10 వేలు రైతులకు అందచేశామని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి అవగాహన లేదని దేవాదులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందని అప్పుడు కడియం శ్రీహరి, తాను ఇద్దరం కష్టపడి దేవాదులను పనులను ప్రారంభించామని తెలిపారు. నాయకులు నవీన్, నాగిరెడ్డి యాకాంతరావు, అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ముస్కు రాంబాబు, సర్వర్‌ఖాన్, శ్రీనివాస్ ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో విజయం మాదే..

కొడకండ్ల, మార్చి 12 : రానున్న లోకసభ ఎన్నికల్లో ఏ పార్టీ సత్తా ఏంటో తెలుస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను , కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. సమావేశంలో ఎంపీపీ డి.జ్యోతి, జడ్పీటీసీ కేలోత్ సత్తెమ్మ, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, నాయకులు పసునూరి మధుసూదన్, డి.గాంధీ నాయక్, పేరం రాము, నారాయణ రెడ్డి, వెంకటేశ్వర రావు, రాజిరెడ్డి, ఆసిఫ్, షన్ను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

సీఎం సభకు తరలిన మహిళలు

రఘునాథపల్లి, మార్చి 12: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనే గ్రామీణ, పట్టణ మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం మంగళవారం జరిగే మహిళా శక్తి విధాన ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీపీ మేకల వరలక్ష్మి ఆధ్వర్యంలో రెండు బస్సులలో మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిపి మేకల వరలక్ష్మితో పాటు మహిళలు నూతనంగా నిర్మించిన భువనగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏకదాటిగా 20 ఏళ్ల పాటు అధి కారంలో కొనసాగాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం సారయ్య, డీసీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పేర్నె ఉష, రీనావతి, యశోద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడు తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలం నుంచి వంద మంది మహిళలు రెండు బస్సుల్లో తరలి వెళ్లారు. ఇందిరమ్మ రాజ్యం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తరలివెళ్లిన మహిళలు తెలిపారు.



మహిళా శక్తి కార్యక్రమానికి వెళుతున్న ఎంపీపీ తదితరులు

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన

- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చనకు హాజరైన భక్తులు



స్వామివారిని 108 స్వర్ణ పుష్పాలతో అలంకరించిన దృశ్యం

చిలుపూర్, మార్చి 12 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సువర్ణ పుష్పార్చన పూజను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అష్టదళ పాద పద్మారాధన కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వామివారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా టికెట్లు కొనుగోలు చేసి పూజలో పాల్గొన్న భక్తులకు ఆశీర్వచనంతో పాటు, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ నేతృత్వంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఈవో భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, పూజారులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడం హర్షనీయం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం రైళ్లలో ప్రయాణించే వారికి మెరుగైన సేవలు అందించం హర్షణీయమని జడ్పీ చైర్మన్ గిరబోయిన భాగ్యలక్ష్మి తెలిపారు. పీఎం నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు సౌకర్యార్థం వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మోదీ వర్చువల్ విధానంలో దేశ వ్యాప్తంగా రూ 85వేల కోట్లకు పైగా నిధులతో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులను స్టాల్స్‌ను ప్రారంభించారు. అందులో భాగంగా ఘన్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను జడ్పీ చైర్మన్ ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడిఈఈ ఈఎల్ఎస్ ఖాజీపేట నోడల్ అధికారి ఫణికుమార్, చీఫ్ హెల్పర్ ఇన్స్‌పెక్టర్ శ్రావణ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్సై రాజన్న, హెచ్‌సీ శ్రీనివాస్, సిబ్బంది వీరకుమార్, సురేష్‌కుమార్, మల్లిఖార్జున్, రాజ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ, నియోజకవర్గ కన్వీనర్ అంజిరెడ్డి, నాయకులు గట్టు కృష్ణ, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రడపాక ప్రదీప్, కొలనుపాక శరత్, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించాలి

చిలుపూర్, మార్చి 12 : గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ 104 కోట్లతో చేపట్టనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తక్షణమే ప్రారంభించి ఎండిపోతున్న పంటలకు సాగునీరందించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కృష్ణాజీగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ఎత్తైన ప్రాంతంలో ఉన్న లింగంపల్లి, కొండాపూర్, శ్రీపతిపల్లి, మల్కాపూర్‌తో పాటు, దిగువన ఉన్న నష్కల్, వంగాలపల్లి గ్రామాల రైతాంగానికి సాగునీరందించడం కోసం మల్లన్నగండి, నష్కల్ - ఉప్పుగల్లు రిజర్వాయర్లపై లిఫ్ట్‌లను ఏర్పాటు చేయడంలో భాగంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ 104 కోట్లను మంజూరు చేసిందన్నారు. నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో ప్రస్తుత రబీ సీజన్‌లో చేతికందిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు, జిల్లా చెందిన మంత్రులు వెంటనే స్పందించి పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాదం పరమేష్, ఊరడి రవి, ఊరడి మల్లయ్య, నారబోయిన భిక్షపతి, సాదం రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

రఘునాథపల్లి, మార్చి 12: ధరణి స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని జనగామ ఆర్డీవో కొమురయ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రఘునాథపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ధరణి స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో బాధితుల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవే క్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కొమురయ్య మాట్లాడుతూ ధరణి స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంను ఈ నెల 14 నుంచి 17 వరకు ప్రభుత్వం పెంచడం జరిగిందని తెలిపారు. తహసీల్దార్ పి.యుగేందర్, డీటీ సదానందం, ఆర్ఐలు బలరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకిర్యాలలో స్వయం పాలన దినోత్సవం

జనగామ కల్చరల్, మార్చి 12: మండలం లోని వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురికి బహుమతులు అందజేశారు.

● జఫర్‌గఢ్ : మండలంలోని కోనాయిచలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లలో మంగళవారం స్వయం పాలనా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. చక్కగా ముస్తాబై ఆయా తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఎంఈఓగా ఆర్.రిత్విక్, హెచ్‌ఎంగా ఆర్.రిష్విక, ఉపాధ్యాయినులుగా ఆర్.అమూల్య, జె.జెస్సీ, కె.చందన,. ఆర్.రష్మిత, అటెండర్‌గా జి.రెష్వంత్, వ్యవహరించి ప్రశంసలందుకున్నారు.

బోయినిగూడెం కెనాల్‌ను పరిశీలించిన పాలకుర్తి ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 12: మండలంలోని బోయినిగూడెం పరిదిలోని ఘన్‌పూర్-పాలకుర్తి దేవాదుల కెనాల్‌ను మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఘన్‌పూర్ ఆర్ఎస్ రిజర్వాయర్ నుంచి పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని పంట పొలాలకు సాగునీరు వెళ్లే కెనాల్‌ను బోయినిగూడెం వద్ద ఎమ్మెల్యే పరిశీలించి కొబ్బరికాయ కొట్టి నీటిలో పసుపు కుంకుమ చల్లి పూజలు నిర్వహించారు. కాలువలో నీరు దిగువకు వెళ్లకుండా కొందరు వ్యక్తులు అడ్డంగా మొరం పోశారని సంబంధిత అధికారులు వెంటనే మొరంను తొలగించి నీరు సజావుగా వెళ్లేలా చూడాలని అదేశించినట్లు తెలిపారు.

ఇష్టపడి చదవాలి

కొడకండ్ల : కష్టపడి కాకుండా ఇష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఎల్యే యశస్విని రెడ్డి విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు. మండలకేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం రాత్రి స్టడీ మెటీరియల్ , పెన్నులు, పెన్సిళ్లను, పరీక్ష ప్యాడ్‌లను పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి వృద్ధిలోకి రావాలని , చదువుకున్న పాఠశాలకు, ప్రాంతానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్ఎస్ ప్రిన్సిపాల్ దిలీప్, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు డి.సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాజేష్, ధర్మారం భిక్షపతి, నాగరాజు, మసురం రవీందర్, బత్తుల వెంకన్న, వలభోజు రమేశ్, పల్లె అనిల్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



బోయినిగూడెం కెనాల్ వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తరిగొప్పుల, మార్చి 12: ఎన్నికల హామీలలో బాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలలో ఐదు హామీలు నెరవేర్చిన సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీ అర్జుల మధుసూధన్ రెడ్డి, నాయకులు చిలువేరు సంపత్, గోరంతల వీరన్న, బ్భంగి శివకుమార్, ఎడెల్లి శ్రావణ్ రెడ్డి, గంగం నర్సింహ్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నపెండ్యాలలో చోరీ

చిలుపూర్, మార్చి 12 : రూ 1. 50 లక్షల విలువ గల బ్రిక్స్ మెటీరియల్ (విద్యుత్ మోటార్లు, డంగ్ మెషీన్) చోరీకి గురైన సంఘటన మండలంలోని చిన్నపెండ్యాలలో జరిగింది. మంగళవారం చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గడ్డమీది సురేశ్‌కు చిన్నపెండ్యాల - తరిగొప్పుల ప్రధాన రహదారికి ఆనుకుని ఓ రైస్‌మిల్ సమీపంలో బ్రిక్స్ (సిమెంట్ ఇటుకలు) తయారీ కేంద్రం ఉంది. రోజూ మాదిరిగానే విధులు ముగించుకుని ఇంటికి వెళ్ళిన ఆయన ఉదయం వచ్చి చూసేసరికి అందులో ఉన్న విద్యుత్ మోటార్లతో పాటు, డంగ్ మెషీన్, ఇతర ఉపకరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా క్రాంతి



జనగామ టౌన్, మార్చి 12: కాంగ్రెస్ సోషల్ మీడియా జనగామ జిల్లా కో ఆర్డినేటర్‌గా దాసరి క్రాంతి నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ నవీన్ పెట్టెం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నవీన్ పెట్టెం, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర, ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా ఎల్లయ్య

జఫర్‌గఢ్, మార్చి 12 : నేషనల్ మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎన్‌ఎంఆర్‌పీఎస్) స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంకు చెందిన తాటికాయల ఎల్లయ్య, అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన తాటికాయల సంపత్ నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ ఎన్‌ఎంఆర్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బిఎన్.రమేశ్‌కుమార్ మంగళవారం ఉత్త ర్వులు జారీ చేశారు. నియామకపత్రాలను ఆ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తాటికాయల చిరంజీవి మంగళవారం జఫర్‌గఢ్‌లో ఎల్లయ్య, సంపత్‌లకు అందజేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

జనగామ టౌన్, మార్చి 12: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో ఆటో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఎవరైనా ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దొంగత నాలు, గంజాయి సరఫరా తదితర నేరాల నియంత్రణకు సహకరించాలన్నారు. జనగామను రోడ్ యాక్సిడెంట్ ఫ్రీ, క్రైం ఫ్రీగా మార్చేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై పిట్టల తిరుపతి, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

పాలకుర్తి, మార్చి 12 : ఈ నెల 10 నుంచి 11 తేదీల్లో మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్‌లో జరిగిన 18వ జాతీయ స్థాయి వుడ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని చెన్నూరుకు చెందిన క్రీడాకారులు పథకాల పంట పండిచారు. గ్రామానికి చెందిన కందిక ఆదర్శ్ పసిడి పతకం సాధించగా, బాలబోయిన సందీప్ కాంస్య పతకం సాధించాడు. సింగిల్ స్ట్రోక్ గేమ్‌లో పసిడి పతకం సాధించిన ఆదర్శ్‌ను, సింగిల్ స్ట్రోక్ గేమ్‌లోనే కాంస్య పతకం సాధించిన సందీప్‌ను ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, గ్రామ ఎంపీటీసీ పుస్కూరి కలింగరావులు అభినందించారు. చెన్నూరు గ్రామస్తులు మాజీ సర్పంచ్ పార్వతీ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణు అభినందించారు.

ఖర్గేతో సింగపురం ఇందిర భేటీ

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 12: ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అదే విధంగా ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఇందిర భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై నాయకులతో ఆమె చర్చించినట్లు తెలిసింది.



ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో ఇందిర

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువు

దేవరుప్పుల, మార్చి 12 : కాంగ్రెస్ అధికారంలోకి ఎప్పుడు వచ్చిన కరువు కాట కాలతోనే వస్తుందని అందుకు నిదర్శనంగా మండలంలో రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరి పంటలు ఎండిపోతున్నందుకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సుందర్‌రాంరెడ్డి

జలశయాలు నింపి సాగునీరందించాలి

జఫర్‌గఢ్, మార్చి 12 : రిజర్వాయర్ ద్వారా చెరువులు, కుంటలను నింపి పంటలకు సాగునీరందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఓబులాపూర్, ముగ్దుంతండాలో సాగునీరు లేక ఎండిన వరి పంటలను మంగళవారం ఆయన పార్టీ ప్రతినిధులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ మండలంలోని అనేక గ్రామాల్లో బోరు బావుల్లో నీటిమట్టం తగ్గిపోయి, చెరువులు, కుంటల్లో నీరు లేక పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ కాలువ పనులను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బానోత్ లింగానాయక్, దేవానాయక్, బుచ్చన్న, దుర్గాసింగ్, మోతీలాల్, స్వామినాయక్, టీక్యా, అమర్‌సింగ్ పాల్గొన్నారు.



సాగునీరు లేక ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

సీఎంను కలిసిన డీసీసీబీ వైస్ చైర్మన్

కొడకండ్ల, మార్చి 12 : సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం హైద రాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నా రు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కుందూరుకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మూడు రోజులు క్రితమే హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డి సమక్షంలో కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



సీఎంను కలిసిన కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు